క్లుప్తంగా

ఎస్సీ,ఎస్టీ ఎన్నికలకు 25 నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రస్తుత కార్యదర్శి కొల్లి దేముడు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 10 జరగనున్న భెల్ (హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం 25 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 5న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణల అనంతరం 6వ తేదీన అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 162 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రస్తుత ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు తన అనుచరులతో భారీగా తరలి వచ్చి రిటర్నింగ్ అధికారి కె.పి.మిశ్రాకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించండి



ఉక్కు ఎల్‌డీసీ కూడలి వద్ద ప్రచారం చేస్తున్న పర్యావరణ నిర్వహణ ఉద్యోగులు

ఉక్కునగరం: ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని ఉక్కు పర్యావరణ నిర్వహణ విభాగం ఉద్యోగులు నినదించారు. జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విభాగం ఉద్యోగులు ఉక్కు ఎల్‌డీసీ విభాగం వద్ద శనివారం ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగం అధికారులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడం, ప్లాస్టిక్‌ను నివారించడం వంటి చర్యలు ద్వారా పర్యావరణ సమతుల్యతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఫణికుమార్, బి. శ్రీనివాస్, కిషోర్‌చెన్న, ప్రవీణ్ మింజ్, డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామికి జ్యేష్టాభిషేకం



జగన్నాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

అగనంపూడి: జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా అగనంపూడి సత్రం ఆవరణలో కొలువై ఉన్న స్వామి వారికి శనివారం ఘనంగా జ్యేష్టాభిషేకం జరిపించారు. ఉత్సవమూర్తులకు 108 కలశాల (కొబ్బరి బొండాల)తో అభిషేకం చేశారు. స్వామి వారి రథయాత్ర ప్రారంభానికి పక్షం రోజుల ముందు జ్యేష్ట పౌర్ణమి నాడు స్వామివారికి జ్యేష్టాభిషేకాలు చేస్తామని అర్చకులు తెలిపారు. ముందుగా ఆలయ అర్చకులు గురు సంతోష్ కుమార్ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో జగన్నాథరావు, కమిటీ ప్రతినిధులు, ఆలయ అర్చక కుటుంబీకుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ. 16.9 లక్షలు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో శనివారం దేవదాయ శాఖ తనిఖీదారు ఎ.జగన్నాథం పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. 23 రోజులకు గాను రూ.16 లక్షల 92 వేల 807 రూపాయల నగదుతో పాటు 5.2 గ్రాముల బంగారం, వెండి 165 గ్రాములు విరాళంగా వచ్చింది. అలాగే 31 యుఎస్‌ఏ డాలర్లు, 2 సింగపూర్ డాలర్లు హుండీ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.బోశస్ వెల్లడించారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులతో పాటు దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, డీఎస్ ప్రసాద్, ఈ. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎందుకింత హైరానా?

- మార్టిగేజ్ స్థలంలో పార్కు నిర్మించాలని కోరుతున్న సెలెస్ట్‌వాసులు
- పార్కింగ్ స్లాట్ అభివృద్ధి పేరుతో పనులు ప్రారంభించిన జీవీఎంసీ అధికారులు
- అనుమతులు లేకుండా పనులు ప్రారంభించడంపై నివాసుల ఆగ్రహం



పనులను అడ్డుకొంటున్న కాలనీవాసులు



సెలెస్ట్ వద్ద మార్టిగేజ్ స్థలంలో పొక్లెయిన్‌తో తవ్వుతున్న దృశ్యం

గాజువాక : స్థానిక సెలెస్ట్ గేటెడ్ కమ్యూనిటీ నివాసాల నిర్మాణం కోసం సంబంధిత బిల్డర్ జీవీఎంసీకి మార్టిగేజ్ చేసిన 75 సెంట్ల (3600 చదరపు గజాల) స్థల వినియోగంలో గందరగోళం చోటుచేసుకుంది. ఆ స్థలంలో పార్కు నిర్మించి ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలని సెలెస్ట్‌వాసులు కోరుతున్న నేపథ్యంలో అక్కడ పార్కింగ్‌ను ఏర్పాటు చేస్తామంటూ జోనల్ అధికారులు శనివారం యుద్ధప్రాతిపదికన పనులను చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. ప్రజల అభీష్టాన్ని కాదని బిల్డర్‌కు ప్రయోజనం చేకూరే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సెలెస్ట్ గేటెడ్ కమ్యూనిటీ నివాసాల నిర్మాణ అనుమతుల కోసం బిల్డర్ 75 సెంట్ల స్థలాన్ని జీవీఎంసీకి మార్టిగేజ్ చేశారు. ఇప్పుడు ఆ భవనాలకు ఆక్యుపెన్సీ పొందడం కోసం మార్టిగేజ్ చేసిన స్థలాన్ని జీవీఎంసీకి అప్పగించారు. అప్పటివరకు సెలెస్ట్‌లో భాగంగా ఉన్న ఈ స్థలాన్ని జీవీఎంసీకి అప్పగించడంతో అందులో పార్కు నిర్మించి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు అధికారులను కోరారు. దీనిపై స్థానిక కార్పొరేటర్ ఉరుకూటి చందు ఆధ్వర్యంలో మేయర్‌కు వినతి పత్రం అందజేశారు. దీనికోసం ఎమ్మెల్యే నాగిరెడ్డి కూడా సిఫార్సు లేఖ అందజేసినట్టు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, అందులో పార్కింగ్ ఏర్పాటు పేరుతో జీవీఎంసీ అధికారులు అకస్మాత్తుగా పనులను ప్రారంభించారు. మూడు టిప్పర్లు, రెండు జేసీబీలతో పనులను ప్రారంభించడంతో కాలనీవాసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ చందు, అందులో నివాసముంటున్న మరో కార్పొరేటర్ సురేష్, కాలనీ సంఘాల ప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకొని పనులు చేస్తున్న వారిని నిలదీశారు. వారు టౌన్ ప్లానింగ్ అధికారులు పనులను అప్పగించినట్లు చెప్పడంతో, వారిని సంప్రదించగా జోనల్ కమిషనర్ చెప్పారని పేర్కొనడంతో ఆయన్ను ఫోన్‌లో సంప్రదించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలతో పనులు చేపట్టామని జెడ్సీ తెలియజేయడంతో పనులు చేసేందుకు ఇచ్చిన ఉత్తర్వులను చూపించాల్సిందిగా కోరారు. దీంతో పనులు నిలిచిపోయాయి.

బిల్డర్ ప్రయోజనం కోసమేనా?

పార్కు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నా అక్కడ పార్కింగ్ స్లాట్‌ను అభివృద్ధి చేస్తామని అధికారులు చెప్పడంపై నివాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ పక్కన ఉన్న పెద్దపెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద లేని పార్కింగ్ ప్రతిపాదనలు ఇక్కడ ఎందుకని ప్రశ్నిస్తున్నారు. సెలెస్ట్‌లో కమర్షియల్ నిర్మాణాలు ప్రస్తుతం ఖాళీగా ఉండిపోయాయి. అందులోకి రాకపోకలు సాగించడానికి, అక్కడికి వచ్చే వాహనాలకు పార్కింగ్ లేకపోవడంతో దుకాణాల వైపు ఎవరూ చూడటంలేదు. ఈ నేపథ్యంలో అక్కడ పార్కింగ్ ఏర్పాటు చేస్తే ఆ దుకాణాలకు గిరాకీ వస్తుందనే ఉద్దేశంతోనే ఈ పనులను ప్రారంభించినట్టు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

టిప్పర్లను అడ్డుకున్న నివాసులు

ఈ స్థలంలో గ్రావెల్‌ను తరలించడానికి వచ్చిన టిప్పర్లను కాలనీవాసులు అడ్డుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇక్కడ మట్టిని ఎలా తరలిస్తారని పని చేయిస్తున్న వారిని నిలదీశారు. దీంతో టిప్పర్ల యజమాని అక్కడికి వచ్చి పని ఆపేస్తున్నామని చెప్పారు. దీంతో ఆ టిప్పర్లను గాజువాక పోలీసులకు అప్పగిస్తామని కాలనీవాసులు యజమానికి స్పష్టం చేశారు.

కమిషనర్ ఉత్తర్వుల మేరకే పనులు

అది పూర్తిగా జీవీఎంసీ స్థలం. అందులో పనులను జీవీఎంసీ కమిషనర్ ఉత్తర్వుల మేరకే చేపట్టాం. హైవేను ఆనుకొని కొంత సర్వీసు రోడ్డును అభివృద్ధి చేస్తాం. మిగిలిన స్థలంలో పార్కింగ్ స్లాట్‌ను అభివృద్ధి చేస్తాం.

– పి.సింహాచలం, గాజువాక జోనల్ కమిషనర్

స్థలాన్ని స్వాధీనం చేసుకొంటున్నాం

అది మార్టిగేజ్ స్థలం. దాన్ని మేము స్వాధీనం చేసుకోవడం కోసం దాన్ని చదును చేస్తున్నాం. జెడ్సీ ఆదేశాల మేరకు ఈ పనులు చేపట్టాం. బిల్డర్ మాకు స్థలాన్ని అప్పగించినప్పటికీ అక్కడి ప్రహరీని ఆయన తొలగించలేదు. దాన్ని కూడా గతంలో మేమే తొలగించాం.

– రేవతి, టీపీబీవో, గాజువాక జోన్

కౌన్సిల్ అనుమతులు అవసరం లేదా?

ఆ స్థలాన్ని ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. అందులో ఏ పని చేపట్టాలన్నా కౌన్సిల్ ఆమోదం తీసుకోవాలి. విలువైన ఆ స్థలంలో జనానికి ఉపయోగపడే పార్కు నిర్మించాలని మేం కోరుతుంటే దానికి విరుద్ధంగా పార్కింగ్ స్లాట్‌ను అభివృద్ధి చేస్తామని అధికారులు ఏకంగా పనులే ప్రారంభించేశారు. దీనికి కౌన్సిల్ అనుమతులు అవసరం లేదా? కేవలం కమిషనర్ మాటతో పనులు పూర్తయిపోతాయా? ఇది ఎవరి ప్రయోజనం కోసమో అర్థం కావడంలేదు. దీన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి మేయర్‌తో, కమిషనర్‌తో చర్చిస్తాం.

– ఉరుకూటి చందు, 70వ వార్డు కార్పొరేటర్

ఘనంగా హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మహంతి

అగనంపూడి: అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి మరియు పరిశోధనా కేంద్రం 9వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉక్కు డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మహంతి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన క్యాన్సర్ బాధితులకు ఆస్పత్రి సేవలు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు. ఆస్పత్రి డైరెక్టర్ మహంతి శెట్టి మాట్లాడుతూ ఆస్పత్రిలో వంద పడకలతో పాటు రోగుల సహాయకులకు ప్రత్యేక వసతి కల్పించడం జరిగిందన్నారు. ఏడు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, డే కేర్ కీమోథెరపీ, బయో కెమికల్, పెథాలజీ, మైక్రో బయోలజీ, మెమోగ్రాఫ్, సిటీ స్కానర్లు, పీఈటీ స్కానర్లు, దంత ఫిజియోథెరపీ, పాలియేటివ్‌కేర్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆస్పత్రి ఆవరణలో ఆదివారం లైవ్ సర్జికల్ అండ్ బేసిక్ సూటరింగ్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పం



వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీలో వికసించిన మే పుష్పం

కూర్మన్నపాలెం: వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీలోని శ్రీరంగ నిలయంలో నివాసముంటున్న గంగవరం పోర్ట్ ఉద్యోగి పోలిశెట్టి సూకరాజు ఇంట్లో మే పుష్పం వికసించింది. సూకరాజు రెండు సంవత్సరాల క్రితం బంధువుల ఇంటి నుంచి ఈ మొక్కను తీసుకువచ్చి తమ నివాసంలో నాటారు. ఈ క్రమంలో మే 31వ తేదీన వికసించిన ఈ పుష్పం స్థానికులను ఆకర్షిస్తోంది.

మత్స్యకారులకు ప్రత్యేక శిక్షణ



శిక్షణ పొందిన మత్స్యకారులతో అధికారులు

మహారాణిపేట : సముద్రంలో ప్రయాణించే మత్స్యకారులు అత్యవసర పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణాలు రక్షించుకోవచ్చని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ పేర్కొన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మత్స్యకారులకు బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) అంశంపై నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శనివారం కొత్తజాలారిపేట గంగాదేవి ఆలయ ప్రాంగణంలో 50 మంది మత్స్యకారులకు నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంటు బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) ఆర్థిక ప్రోత్సాహంతో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న వారికి ఆస్ట్రేలియన్ లైఫ్ సేవింగ్ అకాడమీ (ఏఎల్ఎస్ఏ) సర్టిఫికెట్లు అందజేసింది. మూడు రోజుల శిక్షణలో పాల్గొన్న వారికి రోజుకు రూ.300 రూపాయలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు జేడీ విజయ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ డైరెక్టర్ భరత్, సీనియర్ ట్రైనర్ బాలు, కొండలరావు, వివిధ మత్స్యకార సంఘాల నాయకులు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు విజయకృష్ణ, మత్స్యశాఖాభివృద్ధి అధికారి డి.మురళి, మత్స్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



నాగేశ్వరరావుకు పింఛన్ అందిస్తున్న సచివాలయ సిబ్బంది

అగనంపూడి: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అగనంపూడి బీసీ కాలనీకి చెందిన వృద్ధుడికి వార్డు సచివాలయ కార్యదర్శి పింఛన్ అందించారు. 85వ వార్డు అగనంపూడి బీసీ కాలనీ వార్డు సచివాలయం 9వ క్లస్టర్‌కు చెందిన తాడిపూడి నాగేశ్వరరావుకు మెదడుకు ఆపరేషన్ కావడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ శనివారం కేజీహెచ్‌కు వెళ్లి నాగేశ్వరరావుకు వృద్ధాప్య పింఛన్‌ను అందించారు. దీంతో ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం

దాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేయాలని మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి ఎం. శ్యాంప్రసాద్ తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, ప్రతినిధులకు క్రమశిక్షణ తప్పనిసరి అని పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విధుల నిర్వహణకు సంబంధించి కౌన్సిల్ సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాధితులపై కౌన్సిల్ సభ్యులు బెదిరింపులకు పాల్పడితే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు. మానవ హక్కుల కౌన్సిల్ వలంటీర్లు తమకు తామే జవాబుదారీగా, నిజాయితీగా ఉండాలని, హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేయాలన్నారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్.కోటలో వెయ్యికి పైగా మొక్కలు నాటనున్నట్టు శ్యాంప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ రమణ, సూర్య, శ్రీనివాస్, ప్రసాద్, సీనియర్ సభ్యుడు గుండు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండ రాముని విగ్రహ ప్రతిష్ట



మహాపూర్ణాహుతి సమర్పిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్‌లో కోదండ రాముని విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. ఈ నెల 1వ తేదీ నుంచి జరుగుతున్న ప్రతిష్టాపన ఉత్సవాల్లో భాగంగా శనివారం హోమములు, మండపార్చనలు, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, గోమాతా దర్పణ దర్శనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం గోపుర శిఖరం నుంచి బూరెలను భక్తుల పైకి విసిరారు. సీతా రాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. చేకూరి రాజు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ కమిటీ, గ్రామ ప్రజలు, రాంనగర్ హౌస్ అండ్ ఫ్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

842వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోవాలన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 842వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. పోరాటం చేయడం రాష్ట్ర ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గాజువాక

- అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పన
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



మోడర్న్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : గాజువాకలో అన్ని వార్డులను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 66వ వార్డు బీసీ రోడ్‌లో రూ.35 లక్షలతో ఏర్పాటు చేసిన మోడర్న్ లైటింగ్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వార్డుకు నిధులను మంజూరు చేసి, మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. 66వ వార్డులో రోడ్డు పనులు జరుగుతున్నాయని చెప్పారు. మంచినీటి కొరత లేకుండా పైప్ లైన్లను వేశామని, విస్తరణ పనులను కూడా పూర్తి చేశామని తెలిపారు. రూ.35 లక్షలతో మోడర్న్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ వార్డులో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పనులను ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేశామన్నారు. తమ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చి దిద్దుతామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎండి గౌస్, ఏపీజీబీ డైరెక్టర్ అలియా సురాని, స్థానిక నాయకులు పేరం రామకృష్ణారెడ్డి, ఆశ, పెదిరెడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో మొక్కలు నాటిన అధికారులు



ఉక్కు జనరల్ ఆస్పత్రిలో మొక్కలు నాటుతున్న డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శనివారం సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉక్కు ఆగ్రోఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో ఉక్కు జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా ఉత్పత్తికి తగ్గట్టు మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యతకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సుమారు 400 కొబ్బరి, సపోటా, జామ మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ సీజీఎంలు జి. గాంధీ, వై. చంద్రశేఖర్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం



స్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న రుత్వికులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి విశేష ఆరాధన, నిత్య హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ బేడా ప్రదక్షిణ జరిపారు. తర్వాత స్వామికి అవబృదోత్సవం, స్వామికి చక్రస్నానం జరిపారు. అనంతరం స్వామికి పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్య రూపవాణి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

మరో గ్రంథాలయ ఉద్యమం అవసరం



బైకు యాత్రికుడు వెంకటేశ్వర్లును అభినందిస్తున్న సూర్యారావు, సాహితీవేత్తలు

సీతంపేట: గ్రంథాలయాల పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా బైకుపై సంచరిస్తున్న ఒంగోలుకు చెందిన మంచికంటి వెంకటేశ్వర్లు శనివారం ఉదయం నగరానికి చేరుకున్నారు. ద్వారకా నగర్ పౌర గ్రంథాలయానికి వచ్చిన ఆయనకు లైబ్రరీ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒంగోలులో బయలుదేరి రాయలసీమ అంతా పర్యటించి, కోస్తా జిల్లాల మీదుగా ఉత్తరాంధ్రకు వచ్చానని తెలిపారు. గ్రంథాలయాల పరిరక్షణ, అభివృద్ధికి మరో గ్రంథాలయ ఉద్యమం అవసరమన్నారు. ప్రజల వద్దకు పుస్తకం తన నినాదమని, సొంత డబ్బుతో పుస్తకాలు ముద్రించుకునే వారు లేక కొంత మంది రచయితలు నిరాశ, నిస్పృహలో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వదాన్యులు, సేవా తత్పరులు గ్రంథాలయాలను ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలల్లో గ్రంథాలయాలు పిల్లలకు దేవాలయాలని అభివర్ణించారు. రచయితల కోసం సహకార వేదికలు ఏర్పాటు కావాలని సూచించారు. తన పర్యటనలో అనుభవాలను వివరించారు. విశాఖ పౌర గ్రంథాలయం ప్రగతి అభినందనీయని, ఇతర ప్రాంతాల వారికి మంచి నమూనాగా పేర్కొన్నారు. మిత్ర సాహితి వర్మ, అరసం కార్య దర్శి ఉప్పల అప్పలరాజు, మస్తాన్ రెడ్డి,విశాలాంధ్ర బుక్ హౌస్ రాజు, కత్తి పద్మ వెంకటేశ్వర్లును అభినందించారు.